

## ట్రాఫిక్ స్నిగల్స్ పని చేసేలా చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



మాట్లాడుతున్న కమిషనర్

నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ అన్ని తనిఖీ చేసి అవి సక్రమంగా పనిచేసేలా చూడాలని అధికారులను కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగము మరియు ట్రాఫిక్ పోలీస్ వారితో జరిగిన సమావేశంలో నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ స్థితిగతులను సమీక్షించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండు రంగారావు, సిటీ ప్లానర్ జివిఎస్ఎన్.మూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.ఎ.వినూత్న, అర్బన్ తహశీల్దారు శ్రీ సుస్వాగతం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, అసిస్టెంట్ సిటి ప్లానరు వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు.

# తూర్పులో ప్రవేశించిన యువగళం పాదయాత్ర

- నారా లోకేష్ ఘన స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు, అభిమానులు, ప్రజలు

ప్రజాశక్తి-నల్లజర్ల



పాదయాత్రలో ప్రజలకు అభివాదంచేస్తున్న నారా లోకేష్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర తూర్పుగోదావరి జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఉదయం ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం ఆరిపాటి దిబ్బల వద్ద ఏర్పాటుచేసిన క్యాంపు నుంచి 9.45 గంటలకు మొదలైంది. సుమారు 11 గంటలకు పోతవరం చేరింది. తొలుత పోతవరం శివారున, నియోజకవర్గ ప్రారంభంలో. ముళ్ళపూడి దొరాజి, కరుటూరి రవితేజలు నారా లోకేష్ కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కవులూరు గ్రామంలో మాజీ సర్పంచులు బేతన వాణి, సత్యనారాయణ. ఆధ్వర్యంలో ఊరంతా రెడ్ కార్పెట్ పరిచి పూలు చల్లి లోకేష్ కు స్వాగతం పలికారు. దుప్పికుంట కాలనీ వద్ద కనిపించిన చిన్న పిల్లలను ఆయన ముద్దు పెట్టుకున్నారు ఈ సందర్భంగా మహిళలతో ఆయన మాట్లాడారు. అనంతరం చీపురుగుడెంలో జాతీయ రహదారిపై పడివున్న గోతులలో వరినాట్లు వేశారు. తిమ్మన్నపాలెంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులు తమ గోడును వివరిస్తూ వినతి పత్రాన్ని లోకేష్ అందించారు. మధ్యాహ్నం నల్లజర్ల శివారులో ఏర్పాటు చేసిన భోజనాల వద్దకు పాదయాత్ర చేరుకుంది. విరామం అనంతరం నాలుగున్నర గంటలకు గౌడ కులస్తులతో, విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులతో లోకేష్ సమావేశం అయ్యారు. అనంతరం పాదయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి మద్దిపాటి వెంకటరాజు, జెడ్పి మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి కార్యకర్తల సంక్షేమ విభాగ కోఆర్డినేటర్ శిష్టా లోహిత్, మండల నాయకులు పసుమర్తి రతీష్ యద్దనపూడి బ్రహ్మరాజు, యలమాటి శ్రీనివాసరావు మాజీ మండల అధ్యక్షులు జమ్ముల వీర వెంకట సతీష్, మండల పార్టీ అధ్యక్షులు తాతిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



యువతతో కరచాలనం చేస్తున్న లోకేష్

### నల్లజర్లలో కల్లుగీత కార్మికులతో లోకేష్ సమావేశం

ప్రమాదకరమైన వృత్తి చేస్తున్నాం. నిత్యం ప్రమాదాల పాలు అవుతున్నాం.. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత సాయం, బీమా అందడం లేదు.. పని లేని సమయంలో కల్లు గీతకార్మికులకు సహాయం అందించాలని లిక్కర్ షాపుల్లో మాకు హక్కు కల్పించాలి.. కనీసం 20 శాతం షాపులు మాకు కేటాయించాలి.. బిసిలని అనేక కేసులు పెట్టి వైసిపి ప్రభుత్వం వేధిస్తోందని కల్లుగీత కార్మికులు లోకేష్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు.

### బిసిలకు పుట్టినిల్లు టిడిపి

ఈ సందర్భంగ లోకేష్ మాట్లాడుతూ బిసిలకు పుట్టినిల్లు టిడిపి అని అన్నారు. బిసిలకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది తమ పార్టీయేనని అన్నారు. ఎన్‌టిఆర్ బిసిలకు 24 శాతం రిజర్వేషన్లు, చంద్రబాబు బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. దేవేందర్ గౌడ్‌ను ఉమ్మడి రాష్ట్రంలో హోం మంత్రిని చేసిన ఘనత టిడిపిదేనని అన్నారు. నవ్యాంధ్రలో కెఇ కృష్ణ మూర్తిని ఉప ముఖ్య మంత్రి చేశామన్నారు. కల్లు గీత కార్మికుల కోసం ఫెడరేషన్ ఏర్పాటు చేసింది తమ పార్టీయేనని చెప్పారు. రూ.105 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆదరణ పథకంలో భాగంగా పనిముట్లు, టూ వీలర్లు అందజేశామన్నారు. తాటి చెట్లు పెంచడానికి సహకారం అందించింది, ప్రభుత్వం.కల్లు గీత కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చింది, కల్లు గీత కార్మికుల కోసం బీమా అమలు చేసింది టిడిపియేనని అన్నారు. 50 శాతం సబ్సిడీతో రూ.30 లక్షల వరకూ రుణాలు అందజేసింది గత టిడిపి ప్రభుత్వమే. కానీ మీరు ఏం చేశారు? పాలిచ్చే ఆవుని వద్దనుకొని తన్నే దున్నపోతు తెచ్చుకున్నారు అని అంటూ జగన్ కార్పొరేషన్ ద్వారా ఒక్క రూపాయి రుణం అయినా ఇచ్చాడా? ఒక్క టూ వీలర్ ఇచ్చాడా? మీకు పనిముట్లు అందజేశారా? 26 వేల మంది బిసిలపై అక్రమ కేసులు జగన్ ప్రభుత్వం పెట్టిందన్నారు. బిసి నాయకుల పై కేసులు పెట్టి వేధించారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బిసి రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. న్యాయ పోరాటానికి అయ్యే ఖర్చు కూడా టిడిపి ప్రభుత్వమే భరిస్తుందన్నారు. టిడిపి హయాంలో బీమా పక్కగా అమలు చేశామని, ప్రమాదంలో ఎవరైనా చనిపోతే వెంటనే ఆదుకున్నామన్నారు. మత్స్యకారులకు ఎలా అయితే వేట విరామం సమయం లో సహాయం అందించామో అలాగే కల్లు గీత కార్మికులకు పని లేని సమయంలో సహాయం అందించే ఆలోచన చేస్తున్నామన్నారు. చంద్రన్న బీమా పథకాన్ని తిరిగి అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సాధికారక కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కుడిపూడి సత్తిబాబు డైరెక్టర్ సొల్లంగి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. నల్లజర్ల మండలంలో వేలాదిమంది జన సమూహంతో కొనసాగిన లోకేష్ యువ గళం పాదయాత్ర సాయంత్రం ఐదు గంటల నుండి నల్లజర్ల నుంచి ప్రకాష్ రావు పాలెం మీదుగా శుక్రవారం రాత్రి ఆవు పాడు గ్రామ శివారుకు చేరుకుంది రాత్రి బస అనంతరం తిరిగి శనివారం ఉదయం బయలుదేరి ఆవు పాడు మీదగా సింగరాజుపాలెం నుంచి ఏలూరు జిల్లా ఉంగుటూరు చేరుకోనుంది.

# కేంద్ర, రాష్ట్ర విధానాలపై తీవ్ర నిరసన

- సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి పవన్
- సమరభేరిలో ప్రజల నుంచి సంతకాల సేకరణ
- సచివాలయాల్లో వినతిపత్రాల అందజేత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రజలపై ఎడాపెడా ధరలు, పన్నులు, ఛార్జీలు భారం మోపుతున్న కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా నిరసిస్తున్నారనిసిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి బి.పవన్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోంది. ఈ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం రాజమహేంద్రవరంలో కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న 35వ, 36వ, 37వ వార్డు సచివాలయంలో సిపిఎం నాయకుల బృందం వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులకు వినతిపత్రం ఇచ్చారు. ప్రధాన డిమాండ్‌లుగా ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, చదువుకున్న యువతకు తక్షణమే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చెయ్యాలని, ప్రజలపై విద్యుత్ చార్జీలు, సర్దుబాటు ఛార్జి, ట్రూ ఆఫ్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించాలని ప్రజల వద్ద సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రంను అందించారు. ఈ సందర్భంగా సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ సంతకాల సేకరణ లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని, పెరుగుతున్న ధరలపై తీవ్రమైన అసంతృప్తి తెలిపారని అన్నారు. ప్రజలపై ఎడాపెడా ధరలు, పన్నులు, ఛార్జీలు భారం మోపుతున్న కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా నిరసిస్తున్నారని తెలిపారు. పాలకుల తమ వైఖరి మార్చుకుంటే ప్రజలే పాలకులను మర్చి బుద్ధి చెబుతారని అన్నారు. సిపిఎం చేపట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమర భేరి కార్యక్రమాన్ని కొనసాగిస్తామని అన్నారు. సెప్టెంబర్ 4 న మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు.. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేవరకు ప్రజా సమస్యలపై పోరాటాలని కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిపిఎం నగర నాయకులు ఎస్-ఎస్.మూర్తి, కర్రీ.రామకృష్ణ, అప్పల.నరసయ్య, ఐ.సుబ్రహ్మణ్యం, వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

### పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి


**చాగల్లు** విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, పెరిగిన ధరలు అరికట్టాలని, గ్యాస్ బండను రూ.400లకే ఇవ్వాలని సిపిఎం మండలం కార్యదర్శి కెకె.దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం చాగల్లులో కరపత్రాలను సిపిఎం నాయకులు కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు కంకటాల బుద్ధుడు, గారపాటి సుబ్బారావు పాల్గొన్నారు.



చాగల్లులో కరపత్రాలు పంచుతున్న సిపిఎం నాయకులు

### పెరుగుతున్న ధరలు అరికట్టాలి

**దేవరపల్లి** పెరుగుతున్న ధరలు అరికట్టాలని, కరెంటు కోతలు నివారించాలని కరెంటు చార్జీలు తగ్గించాలని సిపిఎం నాయకులు ఎస్.భగత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరుగుతున్న సమర బేరి కార్యక్రమంలో భాగంగా మండలంలోని త్యాజంపూడి సచివాలయం వద్ద గ్రామపంచాయతీ కార్యదర్శి కి వినతి పత్రం సమర్పించారు. భగత్ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై తీవ్రమైన విద్యుత్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం మోపుతోందని అన్నారు. మరోసారి బహుత్తరమైన విద్యుత్ ఉద్యమానికి ప్రజలు సంసిద్ధం కావాలని కోరారు.రైతు నాయకులు నడిగట్ల రామారావు మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో అయినపర్తి శ్రీనివాసరావు, మర పట్ల మోహన్ కల్యాణ్, గట్టెం నాని పాల్గొన్నారు.



త్యాజంపూడిలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

### వీర్రాజుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి-చాగల్లు



పి.వీర్రాజు


రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి తాను ఎంపికైనట్లు శుక్రవారం డిఇఒ నుంచి ఉత్తర్వులు అందాయని చాగల్లు జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వీర్రాజు శుక్రవారం తెలిపారు. వీర్రాజు 1996 సెకండరీ గ్రేడు టీచరుగా ఉద్యోగంలో చేరారు. 1997లో ఎస్ఎగా పదోన్నతి పొందారు. 2014 లో హెచ్ ఎంగా పదోన్నతి పొందారు. 2005 లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందినట్లు తెలిపారు. ఈ నెల 5న విజయవాడలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు వీర్రాజు తెలిపారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలని సీతానగరం ఎస్ఐ చిరంజీవి విజ్ఞప్తి చేశారు.ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండల ప్రజలకు సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు వంటివి జరపడానికి సబ్ డివిజన్ పోలీస్ అధికారి వద్ద ముందుగా అనుమతి పొందవలసి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించాలని అన్నారు.

### కార్టూ'నిజం'




### కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా విడుదల

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

వైఎస్సార్ రైతు భరోసా 2023-24 సంవత్సరానికి గాను జిల్లాకు చెందిన కౌలు రైతులకు మొదటి విడతగా 9,590 మంది కి రూ.7.19 కోట్లు , ఇన్‌పుట్ సబ్సిడీ రూ 68.62 లక్షలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత తెలిపారు. శుక్రవారం తాడేపల్లి లోని సిఎం కార్యాలయం నుంచి జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి బటన్ నొక్కి నగదు బదలీ చేయగా, స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎంపీ, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ 2023 మే-జూన్, జూలై-ఆగష్టు నెలలో సంభవించిన అకాల వర్షాలు దెబ్బతిన్న ఉద్యానవన పంటలకు చెంది ఇన్పుట్ సబ్సిడీ కింద 673 రైతులకు రూ.68 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా అందించడమే కాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు రైతులు, అటవీ భూములు, దేవాదాయ భూములు సాగు చేసుకునే రైతులకు కూడా రైతు భరోసాను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ సిఎం జగన్ చెప్పిన దానికన్నా ముందుగానే మాట ఇచ్చిన దాని కన్నా మిన్నగా రైతులకు ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు.. ఈ సమావేశంలో జిల్లా వ్యసాయ సంఘం సభ్యుడు కంటే వినయ్‌తేజ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, వ్యవసాయ అధికారులు ఎడిలు ఎం.శ్రీనివాస రెడ్డి, మల్లిఖార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో ఎల్ఐసి పాత్ర అభినందనీయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

67 సంవత్సరాలుగాభారతదేశ నిర్మాణం, అభివృద్ధిలో జీవిత బీమా సంస్థ భాగస్వామ్యం అభినందనీయమైనదని ఎస్ఐబి అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ పి.సోమశేఖర్ అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక మోరంపూడి జీవితమే మా సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన 67వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ బి ప్రసాద్ రావు తో కలిసి సోమశేఖర్ ఎల్ఐసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సోమశేఖర్ మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ 30 కోట్ల మంది పాలసీదారులతో, రూ.45 లక్షల కోట్ల ఆస్తులతో భారతదేశంలో నెంబర్ వన్ భీమా సంస్థగా వెలుగొందుతుందన్నారు. జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాద్ రావు మాట్లాడుతూ నాణ్యమైన, సత్వర సేవలందించేందుకు జీవిత బీమా సంస్థ ముందు చూపుతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుందన్నారు. ముఖ్య అతిథి సోమశేఖర్ తో కలిసి బీమావారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ బి.వెంకట కల్యాణ్ పర్సనల్ మేనేజర్ బిఎస్ఎన్ మూర్తి, ఇతర మేనేజర్లు ఎస్.సుందర్ రావు, యానాది శెట్టి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** ఎల్ఐసి కార్యాలయం నందు ఎల్ఐసి 67వ ఆవి ర్భావ దినోత్సవాన్ని బ్రాంచ్ మేనేజర్ కె విద్యా సాగర్ ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎల్ఐసిలో 33 సంవత్సరాలుగా సుదీర్ఘ సేవలందించిన పి.అబ్బాయిని ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ఎబిఎం ఎ.ప్రసన్నకుమార్, స్వరాజ్యలక్ష్మి, వెంకట్రావు, చక్ర శ్రీను, విజయ్, అరసాల ఆనంద్, బి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



మోరంపూడిలో వేడుకల్లో పాల్గొన్న ఎల్ఐసి ఉద్యోగులు



గోవరంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎల్ఐసి ఉద్యోగులు



వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

### విద్యుత్ కోతలపై ఎఇకి వినతి

ప్రజాశక్తి- గోకవరం

కొంతకాలంగా నిరంతరంగా విద్యుత్ కోతలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, విద్యుత్ కోతలకు నిరసనగా ప్రజా ఉద్యమం చేపడతామని టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం మండల విద్యుత్ శాఖ ఎఇకు టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడ గత ప్రభుత్వంలో చేసిన విద్యుత్ ఒప్పందాలను ఈ ప్రభుత్వం వచ్చి రద్దు చేసిందన్నారు. విద్యుత్ చార్జీలు భారమైనా ప్రజలు కడుతున్నారని ఈ ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్తు అందించలేకపోతోందని ఎద్దేవాచేశారు ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ తో గ్రామాలను అంధకారంలోకి నెట్టేస్తే సహించేది లేదన్నారు. సమాచారం కోసం విద్యుత్ సబ్ స్టేషన్ కి ఫోన్ చేస్తుంటే ఉద్యోగులు ఎవరు స్పందించడం లేదని, సరైన సమాచారం ఇవ్వడం లేదన్నారు. టిడిపి నాయకులు మాజీ జెడ్పిటిసి సభ్యులు పాలూరి బోసుబాబు, రాష్ట్ర ఎస్సి సెల్ కార్యదర్శి గురుపే భరత్, టౌన్ కన్వీనర్ పోసిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

### బ్యాంక్ సేవలు చేరవేసేందుకే 'ఐపిపిబి'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువ చేయటానికి ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపిపిబి) ను కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రారంభించినదని రాజమహేంద్రవరం తపాలా డివిజన్ కోమల్ కుమార్ తెలిపారు. ఐపిపిబి సేవలను ప్రారంభించి నేటితో 5 సంవత్సరాలు అయిన సందర్భం గా ప్రధాన తపాలా కార్యాలయ అవరణలో ఉన్న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ శాఖలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐపిపిబి సేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ రాజమహేంద్రవరం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ రాజేంద్ర నాయుడు మాట్లాడు ఏ బ్యాంక్ అకౌంట్ నుంచి అయినా ఐపిపిబి ద్వారా నగదు తీసుకునే అవకాశం ఉందన్నారు. రాజమహేంద్రవరం తపాలా డివిజన్ లోని సుమారు 330 తపాలా కార్యాలయ ద్వారా ఐ పిపిబి.సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సహాయ సూపరింటెండెంట్ శ్రీధరమ్, పోస్ట్ మాస్టర్ సుబ్బారెడ్డి, బజాజ్ ఇన్సూరెన్స్ రీజనల్ మేనేజర్ కే.నరేష్ తదితరులు పాల్గొన్నారు

### తుంగపాడులో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - రాజానగరం

హితకారిణి సమాజం ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చైర్మన్ కాశి బాల ముని కుమారి అన్నారు. శుక్రవారం ఉదయం రాజానగరం మండలం కొత్త తుంగపాడు గ్రామంలోని సర్వే నెంబర్ 850లోని 4.79 సెంట్ల భూమిలోని అక్రమ నిర్మాణాలను జిల్లా దేవాదాయ శాఖ అధికారి వి. సోమరాజు సమక్షంలో హితకారిణి సమాజం చైర్మన్ కాశి ముని కుమారి , దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. విజయలక్ష్మి మరియు ఇతర సిబ్బంది సహాయంతో తొలగించారు. రాజమహేంద్రవరం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విఘ్నేశ్వర స్వామి దేవస్థానం ఇఒ నాగ సురేష్, నాళం వారి సత్రం ఇఒ దారబాబు తదితరులు పాల్గొన్నారు.

### నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-తాళ్లపూడి...

ఒపిఎస్ విధానాన్ని రద్దుచేసి సిపిఎస్ విధానాన్ని అమలులోకి తెచ్చిన 2004 సెప్టెంబర్ 1వ తేదీ ఉద్యోగుల జీవితాల్లో చీకటి రోజు అని సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. ఉద్యోగుల జీవితాల్లో చీకటి రోజును నిరసిస్తూ శుక్రవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై భోజన విరామ సమయంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. జోడా ల మాట్లాడుతూ జిపిఎస్ పెన్షన్ ఒపిఎస్ తో సమానమని అంటున్న పాలకులు దానినే కోరుకుంటున్న ఉద్యోగులకు పాత పెన్షన్ ఇవ్వడానికి ఎందుకు నిరాకరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సిఎం ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు తాము పాత పెన్షన్ కోరుకుంటున్నామని మాకు ఒపిఎస్ తప్ప మరేమీ వద్దని అన్నారు. నిరసన కార్యక్రమంలో జూనియర్ సహాయకులు దీపక్ విఆర్ఒలు, విఆర్ఎలు రమణమ్మ, భాగ్యలక్ష్మి, సురేష్ కార్యాలయ సిబ్బంది నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### సిహెచ్‌సిలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం మండల వైసిపి మాజీ మండల అధ్యక్షులు రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ కార్యవర్గసభ్యుడు ఖాదర్ వల్లీ జన్మదినం సందర్భంగా శుక్రవారం గోపాలపురం సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపిపి వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో గోపాలపురం మండలాన్ని వైసిపి కంచుకోటగా చేసిన ఖాదర్ వల్లీ మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలన్నారు. ఆకాంక్షించారు.అనంతరం కేక్ కట్ చేసి వల్లీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు జెడ్పిటిసి సభ్యులు కాకులపాటి లలిత, వైసిపి నాయకులు పట్టణ అధ్యక్షుడు ముల్లంగి శ్యామసుందర్రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు పెనుగొండ బాలాజీ, మండల మైనార్టీ సభ్యులు ఎస్ కె. మస్తాన్ బాబా, సర్పంచ్లు పఠాన్ ఆన్సర్ బాషా, పీతల ప్రసాద్ బాబు, మండల వైసిపి నాయకుల పాల్గొన్నారు.

# కొత్తగా మంజూరైన పింఛన్ల అందజేత

**జిల్లాలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం అందజేశారు. వివరాలుఇవి..**

ప్రజాశక్తి-యంత్రాంగం

**కొవ్వూరు రూరల్** అర్హులందరికీ వైసిపి ప్రభత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని రాష్ట్ర హెూంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. శుక్రవారం హోం మంత్రి క్యాంపు కార్యాలయంలో నూతనంగా మంజూరైన ఫించన్ దారులకు హోం మంత్రి తానేటి వనిత పింఛన్‌లను అందజేశారు. అనంతరం మంత్రిమాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో కొత్తగా 729 మందికి పెన్షన్లు అందజేయడం ఎంతో సంతోషాన్ని కలుగజేస్తోందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 30 వేల 147 పెన్షన్లు అందజేస్తుంటే.. నూతన పెన్షన్లతో 30వేల 876 మందికి చేరిందన్నారు. **రాజమహేంద్రవరం రూరల్** వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వరావు పర్యవేక్షణలో ధవళేశ్వరంలో శుక్రవారం సచివాలయం 2 పరిధిలోని సచివాలయ కన్వీనర్లు తలారి వర ప్రసాద్, పేర్ల దుర్గ ప్రసాద్, ఎన్‌వి.శేఖర్, చాటకాలచంటి కలిసి కొత్తగా పింఛన మంజూరైన వారికి ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వాలంటీర్లు శ్రీలత, దేవి, దివ్య, లక్ష్మి, పురుషోత్తం,కర్రీ. బాబీ తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, జెడ్‌పిటిసి సభ్యుడు నందిగం భాస్కర రామయ్య తో కలిసి చివటం గ్రామంలో ఇంటింటికీ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చివటం పిఎసి ఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షులు కొఠారు సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యుడు వేముల వెంకట సత్యనారాయణ, గ్రామ కన్వీనర్ కోలా లక్ష్మీ గణపతి, రాజమహేంద్రవరం శివ, గంటిన వెంకన్న, గంటిన లక్ష్మీ గణపతి, దాసరి మునిరాజు, పంచాయతీ కార్యదర్శి కె కష్ణవేణి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న మంత్రి తానేటి వనిత



ధవళేశ్వరంలో లబ్ధిదారులకుపింఛన్ అందజేస్తున్న దృశ్యం

# నేరాలు ఘోరాలు


కిషోర్ మృతదేహం

## యువకుని దారుణ హత్య

ప్రజాశక్తి – అమలాపురం

అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన పోలిశెట్టి కిషోర్ (30)ను కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం హత్య చేశారు. కిషోర్ వెంట ఉన్న అతని స్నేహితుడు అడపా సాయిని తీవ్రంగా గాయపరిచారు. గురువారం రాత్రి గ్రామంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉంటుందని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. మృతుడు అవివాహితుడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈదరపల్లి శ్మశానంలో ఉండగా కిషోర్, అతని స్నేహితుడు సాయిపై ప్రత్యర్థి వర్గం దాడి చేశారు. ఈ దాడిలో కిషోర్ మరణించగా సాయి గాయాలతో బయటపడ్డాడు. కిషోర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయాల పాలైన అడపా సాయిని అమలాపురం లోని ఆర్థోపెడిక్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## పాము కాటుతో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి – జగ్గంపేట రూరల్

మండలంలోని గుర్రంపాలెంలో శుక్రవారం పాము కాటుతో వ్యక్తి మృతి చెందాడు. జగ్గంపేట ఎఎస్ఐ నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం గుర్రంపాలెం గ్రామానికి చెందిన గంజా మోహన్ రావు (49) కౌలు చేస్తున్న పొలానికి నీరు పెడుతుండగా పాము కాటేసింది. మోహన్ రావు ఇంటికి వచ్చి కుమారునికి విషయం చెప్పగా, కుమారుడు చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకొని వెళ్లేసరికి మార్గం మధ్యలో చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు.

## అన్ని రకాల పోషకాహారం అవసరం

ప్రజాశక్తి–కాకినాడ రూరల్

చక్కని ఆరోగ్య శైలి కోసం అన్ని రకాల పోషకాలతో కూడిన మంచి ఆహారం తీసుకోవాలని ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ వేదుల శ్రీరామ శర్మ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేడు మనకు లభించే అన్ని ఆహార పదార్థాలు ఎరువులు, క్రిమిసంహారక మందుల కల్తీతో లభించడంతో ఫంగల్ ఇన్ఫెక్షన్లు, కొన్ని రకాల క్యాన్సర్లకు దారితీస్తున్నాయని అన్నారు. దీని నివారణకు గాను ఆకుకూరలను ఉప్పు నీళ్లలో శుభ్రపరచాలన్నారు. అల్పాహారంగా సీజనల్ పండ్లను తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్నం ఖనిజ లవణాలు గల ఏదైనా ఆహార పదార్థాలను తీసుకోవాలని డాక్టర్ వేదుల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న సుంకర పావని

## లోకేష్ యాత్రతో వైసిపి నాయకులకు వణుకు

ప్రజాశక్తి–కాకినాడ

తమ నాయకుడు నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర వైసిపి నాయకులకు వణుకు పుట్టిస్తోందని కాకినాడ మాజీ మేయర్, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తయిన నేపథ్యంలో 40వ డివిజన్ స్థానిక వివేకానంద పార్క్ సెంటర్, ఎన్టీఆర్ క్యాంటీన్ వద్ద సుంకర పావని ఆధ్వర్యంలో 300 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర ఎండనక వాననకా 200 రోజులకు చేరుకుందన్నారు. పాదయాత్రలో లోకేష్‌కు వస్తున్న స్పందనకు వైసిపి ప్రభుత్వం బెంబేలెత్తుతోందన్నారు.

## 47 మందికి ఒటిఎస్ బాండ్లు పంపిణీ

ప్రజాశక్తి – పెద్దాపురం

స్థానిక నాగమ్మపేటలోని 14వ సచివాలయంలో శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఒటిఎస్ లబ్ధిదారులకు బాండ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో గహ నిర్మాణ సంస్థ రుణ సహాయంతో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు రుణం రద్దు, పట్టాపై పూర్తి హక్కుల కోసం రూ.15 వేలు చెల్లించారన్నారు. వీరిలో 47 మందికి పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బొబ్బిలి హరిబాబు, పప్పల దుర్గారావు, విడదాసరి నాగేంద్ర, సచివాలయం ఎడ్మిన్ ఎ.రవికిరణ్, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'ఆశ్రమ్'లో కాలం చెల్లిన పానీయాలు

ప్రజాశక్తి కాకినాడ రూరల్

స్థానిక నాగమల్లితోట ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ స్పోర్ట్స్ డే సందర్భంగా శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సమయంలో విద్యార్థులకు కాలం చెల్లిన టాటా గ్లోకోజ్ శీతల పానీయాలు అందించారు. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించి పాఠశాల యాజమాన్యానికి తెలియజేయడంతో వెనువెంటనే ఆ పానీయాలను సేకరించి తనిఖీ అధికారులర, పోలీసులకు సమాచారం అందించారు. ఆహార భద్రతా ఉమ్మడి జిల్లా అధికారి శ్రీనివాస్, ఫుడ్ ఇన్స్పెక్టర్ కెవి.సుబ్బారావు, ఎంఇఒం ఎల్.గణేష్ బాబు, పోలీస్ సిబ్బంది స్కూలుకు చేరుకున్నారు. ఆహార భద్రతా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలకు అందించిన శీతల పానీయాలు 4 రోజుల ముందే కాలం చెల్లినట్లు గుర్తించామన్నారు. వాటిని సరఫరా చేసిన కంపెనీపై, పాఠశాల యాజమాన్యంపై చట్టరీత్యా తగు చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఆలస్యంగా సమాచారం ఇవ్వడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యానాం వార్తలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

## వినియోగదారులకు బంపర్ ఆఫర్

ప్రజాశక్తి – యానాం

యానాం నియోజకవర్గంలో ప్రతి వినియోగదారుడు రూ.200 పైగా కొనుగోలు చేసిన బిల్లు (ఇన్వాయిస్) తీసుకొని నా బిల్లు – నా హక్కు పోర్టల్‌లో అప్లోడ్ చేస్తే ప్రతి నెలా రూ.పది వేల నుంచి రూ.కోటి వరకు నగదు బహుమతి గెలుచుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని పుదుచ్చేరి సెంట్రల్ జి.ఎస్.టి ప్రిన్సిపల్ కమిషనర్ పద్మశ్రీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా గుజరాత్, హరియాణా, అస్సాం, దాద్రానగర్ హవేలీ, పుదుచ్చేరిలలో సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ సందర్భంగా గోలాగాత్తుల వారి వీధిలో ఉన్న ట్విన్స్ షోరూమ్‌లో మేరా బిల్ – మేరా అధికార్ కార్యక్రమాన్ని ఆర్ఎఒ మునిస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నల్లా వెంకన్న, మాజేటి సత్య భాస్కర్, గోపాల కృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా రక్షా హరికృష్ణ జయంతి

ప్రజాశక్తి – యానాం

యానాం మాజీ ఎంఎల్ఎ రక్షా హరికృష్ణ 84వ జయంతిని స్థానిక సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, పిడబ్ల్యుడి ఇఇ వీరసెల్వం, సిఐ షణ్ముఖం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వివరించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్థానిక మెట్టకూరు ఫిషర్‌మెన్ పేటలో ఉన్న రక్షా హరికృష్ణ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణ పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న రీజెన్సీ విద్యార్థులు

## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి – యానాం

ప్లాస్టిక్ వాడటం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ యానాం రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుడు దుర్గారావు అధ్యక్షతన ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రీజెన్సీ విద్యార్థులు భారీ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని సే నో టూ ప్లాస్టిక్ అంటూ నినాదాలు చేస్తూ యానాం పురవీధుల గుండా ర్యాలీని సాగించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ఆర్ఎఒ మునిస్వామి ర్యాలీని ప్రారంభించారు. ముందుగా పాఠశాల వద్ద ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు, సిహెచ్.వీరభద్రరావు పాల్గొన్నారు.

# ఓటరు సవరణ సర్వే పరిశీలన

ప్రజాశక్తి– సామర్లకోట రూరల్


సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సీతారామారావు

ఓటర్ జాబితాల సవరణలపై జరిగిన సర్వే సక్రమంగా ఉందా, లేదా అనే అంశాలపై పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు, సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు సామర్లకోటలో శుక్రవారం పర్యటించి పరిశీలించారు. పట్టణంలోని గణపతి నగరం భాస్కర్ నగర్ కాలనీ గాంధీనగర్ ప్రాంతాల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ జాబితా సవరణ సర్వేపై వారు పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఆర్‌డిఒ సీతారామారావు మాట్లాడుతూ ప్రధానంగా ఇప్పటివరకు జరిగిన ఓటర్ జాబితాల సవరణ సర్వేలో ఓట్ల తొలగింపునకు సంబంధించి సరైన కారణాలతో తొలగింపులు నమోదు జరిగిందా, తొలగింపులు ఏమైనా లోపాలు ఉన్నాయని విషయాలను పరిగణలోకి తీసుకుని ఈ పరిశీలన జరుగుతున్నట్టు చెప్పారు. సర్వే బృందం ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి వాస్తవిక విషయాలను తెలుసుకునే ఓట్ల తొలగింపు నమోదు చేపట్టారా అనే విషయాలపై పరిశీలిస్తున్నట్టు చెప్పారు. జూలై 21 నుంచి ఆగస్టు 30వ తేది వరకు జరిగిన సర్వే పైనా పరిశీలన జరుపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఫణి కుమార్, మున్సిపల్ మేనేజర్ సీరెడ్డి అచ్యుతరాజు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే ప్రజలకు భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి–గండేపల్లి

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు అన్నారు. సుబ్బయ్యమ్మపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మహిళల చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాశక్తి చైతన్య రథయాత్ర కమిటీ డాక్టర్ పాలూరి బోసు బాబు, దాపర్తి సీతారామయ్య, కంచుమర్తి రాఘవ మాట్లాడారు. క్లస్టర్ ఇంచార్జ్ అడబాల భాస్కరరావు, కొత్త కొండబాబు, బోండా శ్రీనుబాబు, కుంచె రామకృష్ణ, బోండా శ్రీను, అప్పన శ్రీనివాసరావు, లంక రాంబాబు, గొల్లవిల్లి రాజు, బోండా అర్జున్ రావు పోసిన ప్రసాద్, తిప్పన సత్యవతి, పోలినాటి ధర్మానందకుమారి, నక్కిరెడ్డి సూర్యవతి, గుమ్మళ్ల అనంతలక్ష్మి, గొల్లవిల్లి శ్రీదేవి, ఎల్లాటి అమ్మాజీ, గెద్దాడ సత్యవేణి, రాపాక లక్ష్మి పాల్గొన్నారు.

## జెఎన్‌టియు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బెజవాడ

ప్రజాశక్తి–కాకినాడ రూరల్

జెఎన్‌టియుకె ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రూరల్ మండలం తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయన మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా బెజవాడ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, సిఎం వైఎస్.జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## రామలింగరాజుకు విసి అభినందన

ప్రజాశక్తి–కాకినాడ

జెఎన్టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నరసారావుపేట ట్రిపుల్ ఇ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రామలింగరాజుకు ముంబై ఐఐటి నుంచి నెట్వర్క్స్ ఏరియాలో పుస్తకం రాసేందుకు ఆహ్వానం అందింది. ఆయనకు అధ్యయన ప్రోత్సాహక సెలవును మంజూరు చేస్తూ రిజిస్ట్రార్ ఎల్.సుమలత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జివిఆర్.ప్రసాదరాజు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో అనుభవమున్న రామలింగరాజుకు ఈ అవకాశం లభించడం అభినందనీయమన్నారు. రామలింగరాజుని రెక్టార్ కెవి.రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, యుసిఇకె ప్రిన్సిపల్ ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ యు.వి.రత్నకుమారి, హరిత అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి–తొండంగి (అన్నవరం)

తొండంగి మండలం రావికంపాడులో మూడు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 270 మంది విద్యార్థులకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్ సెంట్రల్ కిచెన్ నుంచి అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ మేడిశెట్టి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సంవత్సర కాలంగా తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లోని 43 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 6000 మంది విద్యార్థులకు అరబిందో సహకారంతో అల్పాహారం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మరో మూడు పాఠశాలలకు సేవలను విస్తరిస్తున్నందుకు అరబిందో ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## తాగునీరు, పింఛన్ల పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి –సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో కుళాయిల ద్వారా ప్రజలకు అందిస్తున్న తాగునీరు, సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం పరిశీలించారు. వార్డుల పర్యటనలో భాగంగా ఆయన కుళాయిల్లో వస్తున్న నీటిని తాగి శుద్ధతను పరిశీలించారు. తాగునీటి ఇబ్బందులపై వార్డుల్లో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబర్ నెల మొదటి రోజు కావడంతో వార్డుల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించి పలువురికి కొత్త పింఛన్లను అందజేశారు. స్థానిక 13వ వార్డులో సుమారు పదిమందికి కొత్త పింఛన్లను ఏడో నెంబర్ సచివాలయం వద్ద అవార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిర్లు పాగా సురేష్ కుమార్, పాలిక కుసుమ చంటిబాబు పాల్గొన్నారు.

## యోగాలో రాష్ట్ర స్థాయికి ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జెఎన్‌టియుకె గ్రౌండ్స్‌లో జరిగిన యోగా స్టేట్ కాంపిటీషన్స్‌లో ముగ్గురు మహిళా క్రీడాకారులు మాస్టర్స్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. డిఎస్ఎ జిల్లా క్రీడా ప్రాంగణంలో యోగా కోచ్ ఇందిరా దేవి వద్ద శిక్షణ పొందుతున్న వారు వెండి, కాంస్య పతకాలు పొంది స్టేట్ లెవెల్‌కు సెలెక్టయ్యారు. ఎం.ప్రియాంక వెండి పతకం సాధించగా, పి.శ్రీలక్ష్మి, వాసవి కాంస్య పతకాలు సాధించారు. శిక్షణ ఇచ్చిన ఇందిరా దేవి, యోగా కోచ్‌ను కె.శ్రీరమణి, బి.శ్రీనివాస కుమార్ అభినందించారు.

## ఘనంగా సామూహిక వ్రతాలు

ప్రజాశక్తి–అన్నవరం

అన్నవరం దేవస్థానం కొండపైన శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని దేవస్థానం అధికారులు నిర్వహించిన ఉచిత సామూహిక వ్రతాల్లో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం రామాలయం ప్రాంగణం వద్ద దేవస్థానం ఇఒ ఎస్ ఆజాద్ సమక్షంలో దేవస్థానం వైదిక సిబ్బంది సాంప్రదాయ రీతిలో వ్రతాలు నిర్వహించారు.

## బంగాళా పేటలో డ్రైనేజీ నిర్మాణం

ప్రజాశక్తి–గోకవరం

మండల కేంద్రమైన గోకవరం బంగాళాపేటలో రూ.4లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు గోకవరం ఎంపిపి సంకరశ్రీవల్లి భర్త సుంకర వీరబాబు తెలిపారు శుక్రవారం ఆయన బంగాళాపేటలకు వెళ్లి వీధులను పరిశీలించారు. బంగాళాపేటలో డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు సుంకర వీరబాబుకి తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు బంగాళపేటలో రెండు డ్రైనేజీలు నిర్మిస్తామని చెప్పారు. ఈ వారంలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామన్నారు.

## అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

ఉండ్రాజవరం : మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా ఎల్ ఆర్ సమయం రెండు గంటలు. కానీ మండలంలో ఏకధాటిగా సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ కోత కొనసాగుతోంది. ఇది ఒక ఉండ్రాజవరం మండలానికేనా లేక మరెక్కడైనా కొనసాగుతుందా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, కోరుకుంటున్నారు.

# సాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి – ఆలమూరు


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్ నాయక్

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కు పాదం తప్పదని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనివాస నాయక్ హెచ్చరించారు. ఆలమూరు స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. మండలంలో సారాయి, గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, కలిగి ఉన్న వాటిపై గట్టినిఘా ఏర్పాటు చేశామని, పాఠశాలల జోన్లు వద్ద ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై చెక్కర్లు కొట్టినా, బాలికలపై ఈవ్ టీజింగ్ చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. అలాగే జాతీయ రహదారిపై ప్రయాణం చేసే ప్రతి వాహనదారుడు ప్రమాదాలు నివారించేందుకు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, ఎక్కువగా జూదాలపై కేసులు నమోదవుతున్నాయని ఇకపై అలాంటి వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. మహిళలను, బాలికలను ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే తనకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి మహిళ తమను కాపాడుకోవడానికి సెల్ఫోన్లో దిశ యాప్ ఉండాలని యాప్ లేని వారు ఆయా గ్రామాల్లో సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీసులను సంప్రదించాలని తెలిపారు. చట్ట నిబంధనలు పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని కోరారు.

# జనసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి – అమలాపురం


రక్తదానం చేస్తున్న రాజబాబు

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బుద్ధాల బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శెట్టిబత్తుల రాజబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా శెట్టిబత్తుల రాజబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురష్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానంతో మరో ప్రాణం కాపాడాలనే లక్ష్యంతో ప్రతీ ఏటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసైనికులు పాల్గొని రక్తదానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మహదాస నాగేశ్వరరావు, సూదా చిన్న, ఆకుల బుజ్జి, చిక్కాల సతీష్, గండి స్వామి, సందాడి శ్రీను, బాలయోగి, గొర్తి పవన్, పోనకల ప్రకాష్, జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధ్యానం పట్ల శ్రద్ధతో ఉండాలి

ప్రజాశక్తి – అమలాపురం రూరల్

అందరూ ధ్యానం పట్ల శ్రద్ధతో ఉండాలని జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ, ప్రిన్సిపాల్ డిపిఆర్సి ఎ.రమణా రెడ్డి సూచిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచాయతీ కార్య దర్శుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపిడిఒ, ఎంఈఒ కార్యాల యాల్లో జరు గుతున్న శిక్షణా కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గత నాలుగు రోజులుగా పంచాయితీ కార్యదర్శులు నేర్చుకున్న వివిధ అంశాలను అడిగి తెలుసు కున్నారు. కార్యదర్శుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ ఏర్పాట్లు, శిక్షణ జరుగు తీరును నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యదర్శుల భవిష్య త్తుకు ఎంతగానో ఉపయోగకరమని తెలిపారు. వీలైతే ఆరు నెలల కొక సారి శిక్షణ ఇప్పించాలని కార్యదర్శులు సీఈఓను కోరారు. పంచాయతీ కార్యదర్శులకు అందించిన ఆరు కరదీపికలను, అందులోని విషయాలను అడిగి తెలుసు కున్నారు. ముఖ్యంగా లేఔట్స్, స్వమిత్రలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె. వెంకటేశ్వరరావు, ఎఓపిఎల్. కె. కుమారి, విస్తరణ అధికారి మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

## అధ్వానంగా పారిశుద్ధ్యం

ప్రజాశక్తి – మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఎటు చూసినా రోడ్లు, కాలువలు వెంబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వర్షాలకు తడిసి ఈ చెత్తకుప్పల నుంచి వచ్చే దుర్వాసనను స్థానికులు, ప్రయాణికులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బైపాస్ రోడ్డు, ఇందిరా గాంధీ రోడ్డులోని కాలువ చెంతనే చెత్తాచెదారం పేరుకుపోయి పెద్ద పెద్ద గుట్టలుగా కన్పిస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పలను తొలగించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దిగబడిన రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి –మండపేట

మండలంలోని మారేడుబాక గ్రామంలోని మాదిగపేటలో సిసి రోడ్లు దిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యకు విడిపోవడంతో రాత్రి సమయాల్లో ప్రజలు జారిపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే మాదిరి జరిగితే తమ ఇంటి నిర్మాణం చేసినప్పుడు తనే గోతులను పూడ్చుకున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.